322)ముఖారి

ప॥ ఇందువల్ల నేమిగద్దు యినుపగుగ్గిళ్ళింతే। యిందిరారమణుసేవే యిరవైనపదవి ॥

చ॥ సతులతో నవ్వులు చందమామగుటుకలు। మతితలపోత లెండమావులనీళ్ళు।
రతులలో మాటలు రావిమానిపువ్వులు। తతి విరహపుకాక తాటిమానినీడ ॥

చ॥ లలనలజవ్వనాలు లక్క పూసక పురులు। నెలకొనిసేసేబత్తి నీటిపై వ్రాత।
చెలువపువినయాలు చేమకూర శైత్యాలు। కొలదిలేని ననుపు గోడమీది సున్నము ॥

చ॥ పడతులవేడుకలు పచ్చివడగండ్లగుళ్ళు। కడుమోవితీపు చింతకాయ కజ్జము।
బడి నలుమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరు-। డడరించినమాయలు అద్దములోన నీడలు ॥